## సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హబ్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్ ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కెరీర్ గైడెన్స్, పైథాన్, టైలరింగ్, డిజైనర్ బ్లౌజెస్, డ్రెస్ డిజైనింగ్, మగ్గం వర్క్, జూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, తదితర కోర్సుల్లో అన్ని వయసుల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వేసవి నేపథ్యంలో ఏడేళ్ల పైబడిన పిల్లలకు పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, డిజైనర్ పేపర్ బ్యాగ్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, యోగా, ఫ్లవర్ మేకింగ్, జ్యువెలరీ మేకింగ్, తదితర కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులు విద్యార్థులు, నిరుద్యోగ యువత, గృహిణిలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీట్లు పరిమితమని, ముందుకు వచ్చిన వారికి ప్రథమ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఎటువంటి వయోపరిమితి లేదని , కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. వివరాలకు 6281139282లో సంప్రదించాలన్నారు.

### ఎంబీఏ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఎంబీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

## ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల (ఓఎల్సీసీ, పీడీసీ, బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల వార్షిక పరీక్షలను వచ్చే నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

# ఓయూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- సర్క్యులర్‌ను రద్దు చేయాలి..
- గవర్నర్‌ను కలిసేందుకు బీఆర్ఎస్ నాయకుల యత్నం
- అడ్డుకొని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గవర్నర్‌కు వినతి పత్రం అందించేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు ఓయూకు వచ్చిన గవర్నర్‌ను కలిసి వర్సిటీలోని సమస్యలపై వినతిపత్రం అందజేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్ర యత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని అడ్డుకొని, అదుపులోకి తీసుకొని లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్సిటీలో ఎలాంటి ఆందోళనలు నిర్వహించకుండా అప్రజాస్వామికంగా అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల హాస్టల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, దానిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై అర్ధరాత్రి విద్యార్థినులు రోడ్డెక్కిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంపస్‌లోని అన్ని హాస్టళ్ల మెస్‌ల్లో నాణ్యత లోపించిందని, నాణ్యతతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. విద్యార్థులు క్యాంపస్‌లో తిరిగేందుకు మరిన్ని ఉ చిత బస్సులను ఏర్పాటు చేయాలని కోరా రు. యూనివర్సిటీలో సరైన సంఖ్యలో బోధ న సిబ్బందిలేక బోధన, పరిశోధనలు కుంటుపడుతున్నాయని వాపోయారు. తక్షణమే వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, దానికి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూ నివర్సిటీలో విద్యార్థులు ..సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటు అ న్నారు. వర్సిటీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ నేతలు డాక్టర్ సత్య, గౌతమ్ ప్రసాద్, అస్మా , తదితరులు ఉన్నారు.

సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ , అతిథులు

## సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు జరగాలి

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉస్మానియా విశ్వవిద్యాలయం: సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు జరగాలని ఉస్మానియా యూనివర్సిటీ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో 'మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ ఫర్ సొసైటల్ అప్లికేషన్' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును బుధవారం ప్రారంభించారు. విభాగంలోని సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిజిక్స్ విభాగం నిర్వహిస్తున్న ఈ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పరిశోధన ఫలితాలు సాధారణ పౌరులు, ముఖ్యంగా గిరిజనులకు అందాలని అభిప్రాయపడ్డారు. ఓయూ ఫిజిక్స్ విభాగం నిర్వహిస్తున్న ఈ సదస్సును ఓ వేదికగా మలచుకుని అనేక పరిశోధనలకు సం బంధించిన చర్చ జరగాలని సూచించారు. మరిన్ని నూతన ఆలోచనలకు అంకురార్పణ జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, ఇంటర్నేషనల్ అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ విజయ్, ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లోరేషన్ అండ్ రీసె ర్చ్ (ఏఎండీ), హైదరాబాద్ డైరెక్టర్ ధీరజ్ పాండే, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరే శ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, పలువురు మాజీ ఉపకులపతులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, డైరెక్టర్లు, ప్రొఫసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గం, రాంగోపాల్‌పేట డివిజన్, నల్లగుట్టలో బుధవారం సాయంత్రం రహీం బాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, మహమూద్ అలీ, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణగౌడ్, అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు మహేశ్ యాదవ్, అరుణ్ భట్, కిరణ్ గౌడ్, గణేశ్, రహమాన్, అబ్దుల్లా, సోహెల్, అహ్మద్ – బేగంపేట, మార్చి 26

అడిమెట్ డివిజన్, రాంనగర్ ఫాతిమా మసీదు వద్ద బుధవారం బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ అధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు – ముషీరాబాద్, మార్చి 26

## అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే చర్యలు

### సికింద్రాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ రవి కిరణ్

సికింద్రాబాద్/మారేడ్‌పల్లి, మార్చి26: సికింద్రాబాద్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో సికింద్రాబాద్‌కు చెందిన టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్లు, వైన్ మెన్ లతో సమావేశం అయ్యారు. అక్రమ నిర్మాణాలపై వరుసగా ఫిర్యాదులు రావడంతో సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులకుమించి అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నవాటిపై చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం

వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై సుదీర్ఘంగా చర్చించారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అదనపు అంతస్తులు, అక్రమ నిర్మాణాల్లో స్థానిక కార్పొరేటర్లు ఇన్‌వాల్వ్ అవుతున్నట్లు జోనల్ కమిషనర్ దృష్టికి వైన్‌మెన్‌లు తీసుకెళ్లారు.అలాగే అక్రమ నిర్మాణాల పట్ల ఇంతకాలం నిర్లక్ష్యం వహించిన వైన్‌మెన్‌లకు మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ సమావేశంలో సీపీ శ్రీనివాస్, ఏసీపీ విఠల్, డీసీపీ సుష్మిత, ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ప్రజాపాలన అంటే ఇదేనా?

### ఓయూలో పోలీసు రాజ్యం .. ముందస్తు అరెస్టులపై మండిపడ్డ విద్యార్థి సంఘాలు

పోలీస్ స్టేషన్ ఆవరణలో నినదిస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసుల రాజ్యం కొనసాగుతోంది. విద్యార్థులు నిద్ర లేవక ముందే హాస్టల్ గదుల్లోకి ప్రవేశించి బలవంతంగా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు నిరాటంకంగా తరలిస్తున్నారు. తాజాగా బుధవారం వర్సిటీలో గవర్నర్ పర్యటన నేపథ్యంలో విద్యార్థి నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఓయూలో వీసీ ప్రొఫెసర్ కుమార్ ప్రజాస్వామ్య వాతావరణాన్ని సమాధి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటున్నట్లుగా ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజాపాలన, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఏదో గ్యారెంటీ అని చెప్పి.. ఓయూను పోలీసు రాజ్యంగా మార్చి విద్యార్థుల స్వేచ్ఛ, హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని పది రోజులుగా శాంతియుతంగా నిరసనలు చేస్తున్నా.. ఇప్పటికీ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. పైగా విద్యార్థుల హాస్టల్ లోకి, తరగతి గదుల్లోకి, లైబ్రరీలోకి పోలీసులకు అనుమతి ఇచ్చి అరెస్టులు చేయించడం దారుణమన్నారు.

## ఓయూలో ఎస్సీ వర్గీకరణ సంబురాలు

వర్గీకరణ సంబురాల్లో ప్రొఫెసర్ కాసిం , తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించినందుకు బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చింతకింది కాసింకు మిఠాయి తినిపించి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 9శాతం మాదిగలకు రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వానికి మాదిగల తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన సందర్భంగా గ్రామ గ్రామాన మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఆరె కంటి శ్రీకాంత్, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రింగు రాంబాబు, మాదిగ జేఏసీ నాయకులు జెర్రిపోతుల సాయన్న, రేవంత్, విద్యార్థి నాయకులు మంద మల్లేశ్, సందీప్ జూపల్లి, సందీప్, మహేశ్, చంద్రకాంత్, రాజు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ అనివార్యం : బోర్డు సీఈఓ

బొల్లారం, మార్చి 26: ఉద్యోగ విరమణ అనివార్యమని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ అన్నారు. బుధవారం ఏడో వార్డు పరిధిలోని లాల్ బజార్ వార్డు కార్యాలయంలో బోర్డు సిబ్బంది చంద్రశేఖర్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి వర్షిని, ఏసీపీ రమేశ్, తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, బోర్డు హార్టికల్చర్ విభాగం అధికారి మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు.. చంద్రశేఖర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లో చంద్రశేఖర్ చేసిన విశేష సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ విజయ్‌బాలు నాయర్, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, బోర్డు సిబ్బంది, నేతలు మార్టిన్ లూథర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## మంచినీటి పైపు లైన్ పనులకు శంకుస్థాపన

బొల్లారం, మార్చి 26: కంటోన్మెంట్ 8వ వార్డు, లోతుకుంట సరస్వతినగర్ కాలనీలో కంటోన్మెంట్ బోర్డు నిధులతో రూ.25 లక్షల వ్యయంతో మంచినీటి పైపులైన్ పనులకు బుధవారం బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సరస్వతినగర్, వెంకటేశ్వర కాలనీ, అన్నా నగర్, చింతా భాయ్, రుద్రా నగర్ పంప్ హౌస్ కాలనీలో పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, శ్రీకాంత్, నర్సింగరావు, ధనుంజయ్‌చారి, విజయ్‌కుమార్, నాగేందర్, పుల్లారెడ్డి, శంకర్, కిషన్, బాణాల శ్రీనివాస్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు .

## యువతితో చనువుగా ఉంటున్నాడని దాడి

ముషీరాబాద్, మార్చి 26: తమ వర్గానికి చెందిన యువతితో మరో వర్గానికి చెందిన యువకుడు చనువుగా ఉంటున్నాడని అతనిపై దాడిచేసిన సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ మీ–సేవ సమీపంలో మంగళవారం రాత్రి బెల్లంపల్లికి చెందిన ఓ యువతి శంషాబాద్‌లో నర్సింగ్ కోర్సు చదువుతుంది. అదే గ్రామానికి చెందిన యువకుడు విద్యానగ లోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతు న్నాడు. అయితే రంజాన్ పండుగ సందర్భంగా ఆ యువతి షాపింగ్ కోసం రాంనగర్‌కు వచ్చింది. ఆ సమయంలో ఆ యువతితో అతను మాట్లాడాడు. గమనించిన మేడిబావి బస్తీకి చెందిన యువతి వర్గానికి చెందిన యువకులు ఆ యువకుడిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు 100కు డయల్ చేయగా ముషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడికి పాల్పడినవారు అక్కడినుంచి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నీసీ పుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన ఇద్దరు యువకులను బుధవారం అరెస్టు చేశారు.

## హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, మార్చి 26: నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం రెన్యువేషన్ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణ అధికారి దేవనాథంలు మాట్లాడుతూ .. హుండీ లెక్కించగా రూ. 1,75, 462 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సురేఖ , కమిటీ సభ్యులు మురికి గణేశ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

సికింద్రాబాద్, మార్చి26: తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీతాఫల్‌మండి డివిజన్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగాలన్నీ మాలలకే దోచిపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇప్పుడు పదవులను కూడా మాలలకే దోచి పెట్టడానికి సిద్ధం కావడం సిగ్గు చేటు అని అన్నారు.. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి అన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. అనంతరం ఎంఎస్పీ ఐదవ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, నాయకులు నందారం సీతారాం మాదిగ, తదితరుల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఘన నివాళులర్పించి.. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాల నర్సింగ్ రావు మాదిగ, రాజలింగం మాదిగ, యుగంధర్, రాజమౌలి, గోవింద్ కాక, లక్ష్మణ్ ,సత్య నారాయణ, నరేందర్, ప్రమోద్ కుమార్ చౌహన్, బాబు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనుల పరిశీలన

చిక్కడపల్లి, మార్చి 26: గాంధీనగర్ డివిజన్, సబర్మతినగర్ బస్తీలో ఇటీవల ప్రారంభమైన నూతన మంచినీటి పైప్ లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ పర్యవేక్షించారు. రానున్న రంజాన్, ఉగాది పండుగల లోపే మంచినీటి సరఫరా అందించే విధంగా పనులు జరగాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్ కు ఆదేశాలిచ్చారు.

## వర్సిటీస్ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్

కవాడిగూడ, మార్చి 26 : యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న టైమ్‌స్కేల్, డైలీవైజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తదితర నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను టైమ్‌స్కేల్ సిబ్బందిగా మార్చుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని, పనిభారం తగ్గించాలన్న డిమాండ్‌ల సాధన కోసం తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీల్లో ఈపీఎఫ్ అమలు కావడం లేదని, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇంటరమ్(ఐఆర్) రిలీఫ్ ఐదు శాతం అన్ని యూనివర్సిటీల్లో అమలు జరిగే విధంగా గతంలో మాదిరిగా చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను టైమ్‌స్కేల్ ఉద్యోగులుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లోని నాన్ టీచింగ్ డైలీవేజ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తదితర కేడర్లకు రెగ్యులర్ ఉద్యోగుల మూల వేతనాన్ని కనీస వేతనంగా చెల్లించాలన్నారు. అప్పటిలోగా రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల జీవో 60 ప్రకారం కనీస వేతనాలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. జీవో నంబర్ 16 ప్రకారం యూనివర్సిటీల్లో ఖాళీల ఆధారంగా టైమ్‌స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ మారితే సిబ్బందిని తొలగించే అన్‌ఫెయిర్ లేబర్ ప్రాక్టీసెస్ మానుకోవాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, రిటైర్ అయిన సిబ్బందికి ఐదు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పది సంవత్సరాలు సర్వీస్ దాటిన వారిని టైమ్‌స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర నేత పాలడుగు భాస్కర్ ధర్నాలో పాల్గొని మద్దతు పలికారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షులు ఎం.పద్మశ్రీ, కోశాధికారి మహమ్మద్ సలార్, అమీర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ముషీరాబాద్, మార్చి 26: శ్రీరామ కృష్ణ నాట్య మండలి సంస్కృతిక సేవా సంస్థ 50 వసంతాల వేడుకల్లో భాగంగా ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పద్మశ్రీ గరికపాటి నరసింహారావు పాల్గొని నవ జీవితంలో నాటక పద్యం అనే అంశంపై ప్రవచనం చేశారు. జీవితమే ఒక నాటకం సర్వ కలల సమన్వితం నాటకం అంటూ ప్రవచించారు. సంస్థ కార్యదర్శులు జొన్నలగడ్డ జగన్మోహన్ రావు, శ్రావణ్ కుమార్, సాయి శివరాం, ఆదిలక్ష్మి, దేవనాద, సూరి, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, లక్ష్మీకాంత శర్మ, దొంతి జంగయ్య గౌడ్, శరణ్ శర్మ, పీవీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నైనాదేవికి 'మహిళ రత్న పురస్కారం'

ప్రముఖ సమాజ సేవకురాలు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ లయన్ నైనా దేవికి 'మహిళారత్న' పురస్కారం – 2025' దక్కింది. నైనాదేవి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆదర్శ్‌లో ట్రెజరరిగా ఉంటూ ఇటీవలనే లయన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320–ఏకు తన సొంత ఖర్చులతో అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్సు ఉచితంగా అందజేశారు. ఆమె నిస్వార్థ సమాజ సేవలను గుర్తించిన ప్రముఖ 'సర్వేజనా:సుఖినోభవంతు' సామాజిక, సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా రత్న పురస్కారాన్ని అందజేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యతేజ, సుబ్రాంత్, ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు . – చిక్కడపల్లి, మార్చి 26

## నేటి నుంచి ఏఎన్ఆర్ శతజయంతి ఉత్సవాలు

అమీర్‌పేట, మార్చి 26: ఆంధ్ర నాటక కళా పరిషత్ 96వ వార్షిక జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు అమీర్‌పేట కమ్మ సంఘం హాలులో పద్మభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి మేక రామకృష్ణ, ఆంధ్ర నాటక కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసా